



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 284 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 20 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 284 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 20 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి
- అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

- మిగతా 2లో


## మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్య
- మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామయ్య
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేశ్‌కు కృతజ్ఞతలు
- కూటమి విజయాలను మండలిలో వినిపించాలని సూచించిన మంత్రి



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు

- మిగతా 2లో



## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

### అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి,

- మిగతా 2లో

# ఎన్నికలకు సిద్ధంకండి..


# గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.

వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.



### త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

#### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

పెన్ పవర్ డెస్క్: త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2లో



### బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

- ఈడీ విచారణకు హాజరైన నటి నిధి అగర్వాల్
- బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో విచారణ
- హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- ఇప్పటికే పలువురు నటులను ప్రశ్నించిన ఈడీ

- మిగతా 2లో

### ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు..

## అసెంబ్లీలో సందడి

పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో

- మిగతా 2లో





### జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

- మిగతా 2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

- మిగతా 2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు



పెన్ పవర్ డెస్క్: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమ ల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి

- మిగతా 2లో

### మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు...

## కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..




పెన్ పవర్ డెస్క్: మేయర్, మున్సిపల్ చైర్మన్ ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది ఏపీ అసెంబ్లీ. బుధవారం ( ఆగస్టు 19 ) సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు మంత్రి నారాయణ. ప్రస్తుతం మేయర్,

- మిగతా 2లో



### 2027 ఎన్నికలే లక్ష్యం..

## బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

- మిగతా 2లో




## నాగబాబుకు పదవి... పవన్ ఇక మారేట్లులేరుగా?

జనసేనలో ఏ పదవి అయినా నేతలు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ వారి ఆశలు మాత్రం అడుగంటుతూనే ఉన్నాయి. పవన్ కల్యాణ్ తన కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శలకు మరింత బలం చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా 'ఏపీ గ్రీన్' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబు పదవిని కేటాయించింది. కేబినెట్ ర్యాంకు పదవి. నామినేటెడ్ పోస్టు. అన్నింటా సామాజికన్యాయం, తనకు కులం, కుటుంబంతో సంబంధం లేదని పదే పదే చెప్పే పవన్ కల్యాణ్ పదవుల విషయానికి వచ్చేసరికి తనకే ప్రయారిటీ ఇవ్వడాన్ని ప్రశ్నించలేకపోతున్నారు కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ నిర్ణయం పై వ్యతిరేకత తీవ్రంగానే కనిపిస్తుంది.

**మంత్రివర్గంలో చోటు దక్కుతుందని...**

నాగబాబుకు మంత్రివర్గంలో పూర్తి స్థాయి బెర్త్ లభిస్తుందని భావించారు. తమకు నామినేటెడ్ పోస్టు దక్కుతాయని జనసేన క్యాడర్ మరియు నేతల్లో ఈ నిర్ణయం కొంత నిరుత్సాహానికి, చర్చకు దారితీసింది. ఏపీ సైంటిఫిక్ అండ్ ఎకోలాజికల్ గ్రీనింగ్, రీఫారేస్టేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నియమించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీ మరియు పర్యావరణ శాఖ పరిధిలోనే ఈ నియామకం జరిగింది.జనసేన వర్గాల్లో చర్చ మాత్రం మొదలయింది. అసలు తమకు ఎప్పటికైనా పదవి లభిస్తుందా? అన్న అనుమానాలు వారిలో కనిపిస్తున్నాయి. నాగబాబు హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉంటారు. పార్టీ కోసం ఆయన పడిన దానికంటే రెట్టింపు కష్టపడిన వారు అనేక మంది జనసేనే నేతలు ఉన్నారు. తమ ఆస్తిపాస్తులను కూడా పోగొట్టుకున్నారు.

**ప్రత్యేకత ఏంటి?**

ఎన్నికల నుంచి పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రివర్గంలో ప్రత్యక్ష స్థానం దక్కుతుందని అందరూ భావించారు. కానీ కేబినెట్ లో చోటు లభించలేదు. ఇది మంత్రి పదవి కాకపోవడంతో ఆ పదవి వేరే వారికి ఇవ్వవచ్చు కదా?అన్న ప్రశ్న తలెత్తుతుంది. నాగబాబు ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు అదనంగా ఈ పదవి ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే జనసైనికుల్లో ఎదురవుతుంది. నిజానికి నాగబాబు వల్ల పార్టీకి ప్రత్యేకంగా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, పవన్ కున్న క్రేజ్, ఇమేజ్ ఆయనకు లేదని, అటువంటి నాగబాబుకు పదవి ఇవ్వడం ఏంటని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కానీ పవన్ తాను చేసిందే శాసనం.. చెప్పిందే చట్టం అని వ్యవహరిస్తున్నారని, ఈ నిర్ణయాల వల్ల జనసేనకు రాజకీయంగా నష్టం జరుగుతుందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే పవన్ కళ్యాణ్ తన సొంత అన్నకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకుండా, పాలనాపరమైన కార్పొరేషన్ పదవితో సరిపెట్టడం ద్వారా రాజకీయ విమర్శలకు తావులేకుండా ఉండే వ్యూహాత్మక నిర్ణయంగా పరిశీలకులు భావిస్తున్నారు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు

- మొదటి పేజి తరువాయి

వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు."రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.

సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు.వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు.జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా,

మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.

గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు.

ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు

## మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య, అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేశ్‌కు వర్ల రామయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరువురు నేతలు కాసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ విజయాలను, ప్రజా అనుకూల విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వర్ల రామయ్యకు సూచించారు. సభలో ప్రజా సమస్యలపై తమ వాణిని బలంగా వినిపించాలని కోరారు. వర్ల రామయ్య వంటి అనుభవజ్ఞుడి సేవలు మండలికి ఎంతో అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి

"సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్టించింది. అయితే, ఆ తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.

ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి

- మొదటి పేజి తరువాయి

కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు.

వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి. ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫొటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి" అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకు కొత్త పార్టీ స్థాపిస్తానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు.

### మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న క్రమంలో ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని... అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని.. 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని అన్నారు నారాయణ. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు మంత్రి నారాయణ.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్, చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని అన్నారు.

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుంది.

రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం, పనులు వేగవంతం.

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుంది.

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

## బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

- పి డి జె జునైద్ అహ్మద్ మౌలానా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:**తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి యార్లగడ్డ వివిధ ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులు, బీఎస్ఎన్ఎల్, వివిధ బ్యాంకులు, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులతో సమావేశమయ్యారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించి, బాధితులకు తగిన పరిహారం అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ ద్వారా పరిష్కరించ దగిన క్రిమినల్ కేసులను గుర్తించి, వాటి జాబితాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. రాజీ పడదగిన ఇతర కేసులను గుర్తించి, వాటిని జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# చెలరేగుతున్న అక్రమార్కులు... కరిగిపోతున్న కొండలు

★ చెరువులోనే అక్రమంగా రోడ్డు నిర్మాణం | ★ ఇదే రీతిలో ప్రకృతి విధ్వంసం

**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:19**కూర్చోని తింటే కొండలైన కరిగిపోతాయనేది సామెత, నేడు అక్రమ తవ్వకాలలో నిజంగానే కొండలు కరిగిపోతున్నాయి

వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో సీతానగరం మండలంలోని చిట్ట చివరి మారుమూల గ్రామపంచాయతీ అయిన నాగంపల్లిలోని ఒకప్పుడు ప్రకృతిని తలపించేలా కొండలు పచ్చని పంట పొలాలు చెరువులు అందమైన కొండలతో ప్రకృతి ఒడిలో అలరించే రీతిలో ఉన్న ఈ గ్రామం పక్కనే చీపురుపల్లి పంచాయతీ అచ్చియపాలెంలో నేడు వినశానం అంచున నిలిచాయి. ప్రకృతి అందాలే గ్రామాల పాలిట శాపంగా మారాయి. పోలవరం జిల్లా దేవీపట్నం మండలం అనుకొని ఉండటాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు యధేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా పాతర వేస్తున్నారు.

వీటి పరిధిలోని 8క్వారీలు..మూడు కసర్లు ప్రకృతిని తొలిచేస్తున్నాయి. నిత్యం వ్యవసాయంపై ఆధారపడి జీవించే నాగంపల్లి రైతులకు స్థానిక క్వారీలు పెద్ద ఎత్తున గదిబండగా మారాయి. నాగంపల్లి పరిధిలోని 13 ఎకరాల విస్తీర్ణంలో ఏకంగా 8 క్వారీలు అనుమతులు మంజూరు అయ్యాయి. గోరంత అనుమతులు పొంది కొండంత తొలిచివేస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. నేషనల్ గ్రీన్ టిబ్యునల్ నిబంధనల ప్రకారం వారి కసర్లు భారీ వాహనాల రాకపోకలకు గ్రామపంచాయతీ రోడ్లు కానీ చెరువు గట్ల రోడ్లు కానీ ఉపయోగించకూడదు. కాలుష్య నివారణకు గ్రీన్ కారిడాన్ ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ ఈ నిబంధనలు ఏవి అమలు కావడం లేదు. దీనిపై ఒక వ్యక్తి పిటిషన్





వేయడంతో మైనింగ్ రెవెన్యూ పొల్యూషన్ ఇరిగేషన్ నాలుగు శాఖల అధికారులు ఇటీవల క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సర్వే చేసి సర్వే రిపోర్ట్ వచ్చిన తర్వాత చూస్తామని మామ అనిపించారు. అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టడమే కాకుండా మరో రెండు చెరువులకు వెళ్లాల్సిన కల్లింగ నీటి ప్రవాహాన్ని సైతం నిలిపివేశారని అక్కడ గోడ నిర్మాణం చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాగంపల్లి పంచాయతీ పరిధిలోని జరుగుతున్న క్వారీలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఒక ప్రత్యేక విచారణ కమిటీ చేపట్టాలని పర్యావరణప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తు తరాలకు పచ్చని ప్రకృతిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


# జీఓ నెం.3 పునరుద్ధరణ, 1/70 చట్ట పరిరక్షణకు ఆదివాసీల నిరాహారదీక్ష




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** జీఓ నెం.3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఆదివాసి లాయర్ మడివి రవితేజ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించేందుకు జీఓ నెం.3ను ప్రత్యేక ఆర్డినెన్స్ లేదా చట్టం ద్వారా పునరుద్ధరించి, రాష్ట్రపతి ఆమోదం పొందాలని డిమాండ్ చేశారు. గిరిజన భూముల పరిరక్షణకు ఉద్దేశించిన 1/70 చట్టాన్ని ఎలాంటి సవరణలు లేకుండా కఠినంగా అమలు చేయాలని కోరారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములను తిరిగి గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు తీగల శ్రీనివాస్, సాధన విద్యాసాగర్, కారం సుందరయ్య, ఎం. వాణిశ్రీ, కే. శాంతిరాజు, పల్లాల లింగారెడ్డి, లావా రెడ్డి, లండ శారద, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, సవలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# అనారోగ్యంతో యువకుడు మృతి



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.19** రెండురోజులునుండిమాచినేని పోషిబాబుకుఆ రోగ్యంబాగాలేకపోవడంతోకుటుంబసభ్యులుమెరుగైనవైద్యంకోసంభద్రాచలం ప్రవేట్,వైద్యశాలకు తరలించారు. వైద్యశాలోచికిత్సపొందుతూ,మృతి చెందడంజరిగింది. వివరాల్లోకి వెళ్తేమండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మాచినేని పోషిబాబు (38)పంచాయితీ పారిశుధ్య కార్మికులుగా కూడా ఇటీవలపనిలోచేరారు. గత రెండురోజులు కొంత అనారోగ్యంగా ఉండడంతోకుటుంబసభ్యులు చికిత్స కోసంభద్రాచలం తరలించారు. అక్కడవైద్యంపొందే సమయంలో పరిస్థితివిషమించిమృతిచెందాడని,వారి బందువులుతెలిపారు. మృతిచెందినపోషిబాబుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వివిధపార్టీలనాయకులు సంతాపంతెలిపారు. మృతిచెందినపోషిబాబుమృతదేహాన్ని సిపిఎం,వై.సి.పి. తెలుగుదేశంనాయకులుసందర్శించారు. ఇంత చిన్నవయస్సులోఇలాజరగడంఅత్యంత బాధాకరం అని దిగ్భ్రంతిని వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైకాపా నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు చిక్కాల బాలు ఐనాల గోపీ స్థానిక వైకాపా నాయకులు సిపియం నాయకులు ధర్మరాజు గుండెపూడి లక్ష్మణరావు నాళ్లరపు ప్రకాష్,రావుకాంతారావు,టీడీపీ నాయకులు నాల్లారపు సత్యనారాయణ, తదితరులు,పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సంసిద్ధం

## కలెక్టర్ కీర్తి చేకూరి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 19:**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లు, సంసిద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి వివరించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై సమీక్షించారు.

తూర్పు గోదావరి జిల్లాలో 21 మండలాల పరిధిలో 342 గ్రామ పంచాయతీలు, 4,040 వార్డులు ఉండగా, మొత్తం 13,43,601 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించేందుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. తొలి దశలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో 175 గ్రామ పంచాయతీలు, రెండో దశలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లోని ఒక మండలంలోని 14 గ్రామ పంచాయతీలు, కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని 9 మండలాల్లో 153 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వివరాలు తెలియజేస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఆగస్టు 18 నుంచి 22 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23, 24 తేదీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించి మార్కింగ్ చేస్తారు. ఆగస్టు 25న పంచాయతీ నోటీసు బోర్డులపై ముసాయిదా జాబితాలను ప్రచురిస్తారు. ఆగస్టు 26 నుంచి 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 2 వరకు అభ్యంతరాలపై విచారణ, తుది నిర్ణయం తీసుకుని ముసాయిదా జాబితాలను సిద్ధం చేస్తారు. సెప్టెంబరు 3 నుంచి 6 వరకు గ్రామ సభల్లో జాబితాలను ధ్రువీకరించి, సెప్టెంబరు 7న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లతో కూడిన తుది జాబితాలను ప్రచురిస్తామన్నారు. పోలింగు కేంద్రాల్లో మౌలిక వసతులు పోలింగు కేంద్రాల గుర్తింపు, జాబితాల తయారీ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి పోలింగు కేంద్రాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు. త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర సదుపాయాలను ముందుగానే పరిశీలించి, ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోనూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ల ఏర్పాట్లు

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పింక్, వైట్ వోవ్ పేపర్‌ను ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, షెడ్యూల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని వివరించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రియాంక మృతి కేసులో నిందితులకు పోలీస్ కస్టడీ



బొమ్మూరు పోలీస్ స్టేషన్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ విచారణ

**రాజమహేంద్రవరం పెన్ పవర్, ఆగస్టు 19:**రాష్ట్రవ్యాప్తంగా విషాదం కలిగించిన మెడికో డాక్టర్ ప్రియాంక దారుణ మృతి కి కారకులైన నిందితులకు పోలీసులకు రెండు రోజులపాటు పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈనెల మూడవ తేదీన ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రసాదాది త్యా మాల్ లో సినిమా చూసి స్కూటీ పై వస్తున్న మెడికో జంట ను మద్యం మత్తు లో నిందితులు కారుతో ఢీ కొట్టిన ఘటన లో మెడికో ప్రియాంక మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు కారకులైన నిందితులను 6 వ తేదీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు జైలు కు తరలించారు . ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం కోసం నిందితులను విచారించేందుకు పోలీస్ కస్టడీ కోరుతూ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దాంతో న్యాయస్థానం నిందితులను 19 , 20 తేదీల్లో రెండు రోజులు పాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక విచారణ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్ ను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో ఆయన స్థానిక బొమ్మూరు పోలీస్ స్టేషన్లో నిందితులను బుధవారం విచారిస్తున్నారు.



ఈ ఘటన మూడో తేదీన రాత్రి 9:45 గంటలకు జరగగా ఆరవ తేదీ వరకు బయటకు వెల్లడి కాకపోవడానికి తెర వెనక అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, వారి అనుచరులు రంగ ప్రవేశం చేసి నిందితులను కాపాడే విధంగా పోలీసులను, నలుగురు మీడియా వ్యక్తులను భారీ స్థాయిలో స్థాయిలో ముడుపులు ఇచ్చి మేనేజ్ చేశారని విమర్శలు తలెత్తిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలోనూ, ప్రతి పక్ష వైసిపి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో మరుగున పడేద్దామని తలపోసిన అధికార పార్టీ నాయకులకు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వెల్లి వెత్తడం తో తప్పనిసరి పరిస్థితిలో ఈ కేసు విచారణకు ప్రత్యేక అధికారి కి అప్పగించింది. ఈ ఘటన తీవ్రత పెరగడానికి నిందితులు సాధారణ మద్యం మత్తు లో లేరని గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సేవించి ఉండడమే కారణమావుతుందని, ఆదిశగా పోలీసులు నిందితుల నుంచి నమూనాలు, నేర ధృవీకరణకు అవసరమైన సాంకేతిక ఆధారాలు సేకరించలేదని, నిందితులను కాపాడేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, పోలీసులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పోలీస్ కస్టడీలో నిందితులు ఎలాంటి విషయాలు వెల్లడిస్తారోనని నగర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పార్థీనియం (వయ్యారిభామ) నిర్మూలనపై వెంకటరామన్నగూడెం కేవీకే లో అవగాహన సదస్సు.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 19:**డా॥ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), వెంకటరామన్నగూడెం నందు పార్థీనియం (వయ్యారిభామ) వల్ల కలిగే అనర్థాలపై రైతులకు, విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన కలిగించే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

"వయ్యారిభామ నిర్మూలన" వారోత్సవాల్లో భాగంగా, నాల్గవ రోజు కేవీకే వ్యవసాయ క్షేత్రంలో ఈ ప్రత్యేక సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెటర్నరీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్

డా॥ వి. సమత మాట్లాడుతూ.. పార్థీనియం కలుపు మొక్కల వల్ల పశువులు మరియు జీవాలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ముఖ్యంగా పశువుల చర్మంపై దద్దుర్లు రావడం, వ్యాధి తీవ్రమైనప్పుడు చర్మం కాలిపోయినట్టుగా మారి ఊడిపోవడం జరుగుతుందని ఆమె వివరించారు. అనంతరం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా॥ సి. హెచ్. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్థీనియం కలుపును సామూహిక నిర్మూలన కార్యక్రమాల ద్వారానే అరికట్టవచ్చని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రైతులను, వ్యవసాయాన్ని అభ్యసించే విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తూ వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సదస్సులో భాగంగా కేవీకే సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి క్షేత్ర పరిసరాలలో ఉన్న పార్థీనియం మొక్కలను తొలగించారు. ఆ మొక్కలను కంపోస్టు తొట్టిలో వేసి ఎరువుగా మార్చే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (వెటర్నరీ) డా॥ బి. రమాదేవి, శాస్త్రవేత్తలు డా॥ ఎ. దేవివరప్రసాద్ రెడ్డి (మత్స్యశాస్త్రం), డా॥ ఇ. రేఖ (ఉద్యాన విభాగం), డా॥ కె. అర్చన (విస్తరణ విభాగం), కేవీకే సిబ్బంది, విద్యార్థులు మరియు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి







**✷ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ మధుమూర్తి,**

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 19:**విద్యార్థులు తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్

కె.మధుమూర్తి సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) లో 2026--27 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని. రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో బుధవారం ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశాలు పొందడం అంతిమ విజయంగా భావించకూడదని, నేర్చుకోవడం, ఎదగడం, బాధ్యతను స్వీకరించడం, సమాజానికి తోడ్పడడం వంటి అంశాలతో కూడిన ముఖ్యమైన ప్రయాణానికి ఆరంభమని తెలుసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థి జీవితంలో మొదటి సంవత్సరం ఎంతో కీలకమైనదని చెప్పారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుంటూ తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. పరిశ్రమలు, ఉద్యోగ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను ప్రస్తావించిన ఆయన, కొత్త ఉద్యోగాలు ఉద్భవిస్తుండగా ప్రస్తుత ఉద్యోగాల స్వరూపం కూడా మారుతుందన్నారు. విద్యార్థులు జీవితాంతం "నేర్చుకోవడం, నేర్చుకున్నదాన్ని విడిచిపెట్టడం, మళ్లీ కొత్తగా నేర్చుకోవడం" అనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. విద్యా జ్ఞానం ఒక్కటే విద్యార్థులను సంపూర్ణంగా తీర్చిదిద్దలేదని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రాయోగిక సామర్థ్యాలు, క్రమశిక్షణ, నైతిక విలువలు, జట్టు భావన, స్థైర్యం, బాధ్యత, సరైన వైఖరి కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఇంజినీరింగ్ అంటే కేవలం పాఠ్యాంశాలను చదవడం, డిగ్రీ పొందడం లేదా ఉద్యోగం సంపాదించడం మాత్రమే కాదని, సమస్యలను అర్థం చేసుకోవడం, జ్ఞానాన్ని అన్వయించడం, ప్రాయోగిక అనుభవాన్ని పొందడం, సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను అభివృద్ధి చేయడమని స్పష్టం చేశారు. విద్యార్థులు "నేను ఇది చదివాను" అనే స్థాయి నుంచి "నేను దీనిని ఉపయోగించగలను", చివరికి "ఈ జ్ఞానాన్ని ఉపయోగించి నేను ఏదైనా అభివృద్ధి చేయగలను" అనే స్థాయికి ఎదగాలని చెప్పారు. విద్యార్థులు వినయం, క్రమశిక్షణ, పట్టుదల, నైతిక ప్రవర్తన, బాధ్యత వంటి వాటిని కలిగి ఉండాలని సూచించారు. కమ్యూనికేషన్, పరస్పర సంబంధాల ప్రాముఖ్యతన ఆయన ప్రస్తావిస్తూ, విద్యార్థులు అర్థవంతమైన ప్రశ్నలు అడగాలని, సమూహ కార్యక్రమాలు, కలసి చదివే విధానాల్లో పాల్గొనాలని సూచించారు. ఇతరులతో నిరంతరం తమను తాము పోల్చుకోవద్దని, తమ గత పనితీరుతో ప్రస్తుత పనితీరును పోల్చుకుంటూ నిరంతర స్వీయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఆనందం, ఒత్తిడి మధ్య తేడాను వివరిస్తూ, కేవలం బాహ్య ఒత్తిడితో కాకుండా నేర్చుకోవడంపై సహజమైన ఆసక్తిని పెంచుకోవాలని తెలిపారు. అదే సమయంలో విద్యార్థి జీవితంలోని కీలక దశలో తాత్కాలిక ఆకర్షణలకు లోనైతే భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు. దీర్ఘకాలిక విజయానికి కష్టపడి పనిచేయడం, నిరంతర సాధన, సమయపాలన, పట్టుదల, సమయాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం అవసరమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నైపుణ్యం, ప్రయోగశాలలు, పరిశోధనా అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, రోబోటిక్స్, సెమీకండక్టర్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, వాటిలో తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులు తమ నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యా కాలమంతా కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు సమర్థులైన, నైతిక విలువలు కలిగిన, బాధ్యతాయుతమైన, సామాజిక చైతన్యం కలిగిన ఇంజినీర్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌లోని పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతిని సద్వినియోగం చేసుకొని, సంస్థకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకువచ్చే అర్థవంతమైన ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి. రమణరావు ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ దేశంలో 31వ ఎన్ఐటీగా స్థాపించబడిన ఈ సంస్థ విజయవంతంగా దశాబ్ద కాల ప్రయాణాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. సంస్థలోని అధ్యాపకుల బలాన్ని ప్రస్తావిస్తూ, వారి జ్ఞానం, అనుభవం, మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొంటూ, అందుబాటులో ఉన్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వివరించారు. డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాలాన్ని సద్వినియోగం చేసుకుంటే మనకు తెలియని ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చని తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను వాయిదా వేయకుండా దృఢ సంకల్పంతో సాధించే విద్యార్థులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ

ప్రతి విద్యార్థి సంస్థ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ ఇండక్షన్ కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగనంది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, అసోసియేట్ డీన్లు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



# ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయాలి



**ఒకరోజు నిరాహార దీక్షలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్**

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 19:**ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి, పార్లమెంటుకు పంపించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే 1/70 చట్టం పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసి, ఆదివాసీల తరపున న్యాయపోరాటంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం చింతూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఆదివాసీ సీనియర్ ఉపాధ్యాయుడు పండ కృష్ణయ్య, ఆదివాసీ మహిళా నాయకురాలు కారం సంకురమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పండ కృష్ణయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే గతంలో జీవో నంబర్ 3 ద్వారా 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలులోకి వచ్చిందన్నారు. అయితే గత ప్రభుత్వాలు జీవో నంబర్ 3 రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోకపోవడంతో 2020లో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ రద్దయిందని పేర్కొన్నారు. తిరిగి 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ సాధించేందుకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్ మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీలు, న్యాయ సమీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఖనిజ సంపద, భూములపై గిరిజనేతరుల కన్ను పడుతోందని, ఆదివాసీల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1/70 చట్టం పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తోందని నిరూపించుకోవాలంటే శాసనసభలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించాలని కోరారు. ఆదివాసీ ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల పరిరక్షణ దీక్షలకు చింతూరు ఆదివాసీ జేఏసీ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ సాధన పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివాసీ జేఏసీ నాయకులు జల్లి నరేష్, పొడియం రామకృష్ణ, కాకా సీతారామయ్య, మడివి రాజు, సాయిబాబు, పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను కాపాడుకోవాలంటే రాజకీయాలకు అతీతంగా ఆదివాసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని అన్నారు. ముఖ్యంగా యువత ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, సోడే లెనిన్, గుర్రం పిడకయ్య, మడకం కన్నయ్య, బడుగు కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ శాంతిర్యాలీ







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 19:**మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాడేపల్లిగూడెం బుధవారం ఉదయం 9.00 గం.లకు మానవతా సంస్థ తరఫున ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ శాంతిర్యాలీ నిర్వహించబదినది. ఈ ర్యాలీ స్థానిక చత్రపతి శివాజీ సెంటర్ (జీవి మాల్) నుండి బయలుదేరి ఎన్టీఆర్ చౌక్ వరకు కొనసాగింది . ఈ కార్యక్రమంలో షిరిడి సాయి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మన మానవతా జిల్లా ప్రెసిడెంట్ వాసిపోయిన చంద్రయ్య మాస్టారు మన ఆహ్వానం మేరకు రావడం జరిగింది. ఆయన చేతుల మీదుగా జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభించారు. చత్రపతి శివాజీ సెంటర్ నుండి ఎన్టీఆర్ చౌక్ వరకు జరిగిన ఈ ర్యాలీలో మన సభ్యులు గానీ స్కూల్ విద్యార్థిని గాని వర్షాన్ని కూడా లెక్కచేయకుండా దిగ్విజయంగా శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంచి మంచి ఉత్తమమైన మరియు ఆదర్శవంతమైన నినాదాలతో దిగ్విజయంగా నిర్వహించడం పలువురు పెద్దల ప్రశంసలు అందుకోవడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వాసిపోయిన చంద్రయ్య , చైర్ పర్సన్ పైడికొండల సింధు, జిల్లా కమిటీ సభ్యులు జినపనేని రాజేంద్రకుమార్ కన్వీనర్ చేకూరి బంగార్రాజు, కార్యదర్శి శ్రీమతి బొడ్డు అరుణ, ట్రెజరర్ వూడిమూడి శ్రీనివాసరాజు, కెవి రామారావు, బురిడీ సతీష్, మిరియాల కిషోర్, జంగా రామ్ రాయ్, డిపి నాయుడు ,యు వి వి సత్యనారాయణ, బి హరి కుమార్, ఎర్ర ఆంజనేయస్వామి, రాగిరెడ్డి ప్రసాద్, బి రాజేంద్రప్రసాద్ , వాసాబక్తుల మోహన్, కోట రాంబాబు, విజయ కుమారి, ప్రశాంతి పాల్గొన్నారు.

# గూడెంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవ వేడుకలు



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 19**తాడేపల్లిగూడెంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవం వేడుకలను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాపక గంగాధర్ అధ్యక్షత వహించారు.

కనిపించే ప్రతి క్షణాన్ని శాశ్వతంగా నిలిపే ఫోటోగ్రఫీ కళ అని పేర్కొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. స్థానిక గోల్డెన్ ఫోటో స్టూడియో అండ్ మిక్సింగ్ యూనిట్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ పితామహుడైన లూయిస్ డాగురె చిత్రపటానికి పుష్పమాలవేసి లూయిస్ డాగురె స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు కాపక గంగాధర్ మాట్లాడుతూ 1839 ఆగస్టు 19న లూయిస్ డాగ్ యొక్క ఫోటోగ్రాఫిక్ పద్ధతికి ఫ్రెంచ్ ప్రభుత్వం పేటెంట్ తీసుకున్న సందర్భంగా అప్పటినుంచి 187 సంవత్సరాలుగా ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ ఫోటోగ్రాఫర్ వృత్తిలో చాలామంది కొనసాగుతూ తమ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా ఈ వృత్తి నేర్చుకున్నారని ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్ లందరికీ కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సెక్రెటరీ, అయితం ప్రసాద్ మాట్లాడుతూ , డాగురె ను స్ఫూర్తిగా తీసుకుని కళను ఎంచుకున్న ఫోటోగ్రఫీ జీవన వృత్తిలో కొనసాగుతున్న ఫోటోగ్రాఫర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ మారాడాని రాము, ఉపాధ్యక్షులు, భాను, పెద్దోజు మురళి, ఫోటోగ్రాఫర్స్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ఫోటోగ్రాఫర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# ఎంపీ ని కలిసిన జనసేన నాయకులు



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 19;** ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ నీ బుధవారం హైదరాబాదులో ఆయన నివాసంలో జీలుగుమిల్లికి చెందిన జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీ తో చర్చించడం జరిగిందని వారు అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఎంపీ ని కలిసిన వారిలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జనసేన సీనియర్ నాయకులు చిర్రి శ్రీను, జీలుగుమిల్లి టౌన్ ప్రెసిడెంట్ కోలా మధు, నూకల శ్రీనివాస్ ఉన్నారు.

# మాజీ ఎంపీ మార్గాని భరత్ అరెస్టు, త్రీ టౌన్ స్టేషన్ కు తరలింపు





- 40వ డివిజన్‌లో వైసిపిలో చేరికలను అడ్డుకున్న పోలీసులు, తీవ్ర ఉద్రిక్తత
- ఇవిఎం ఎమ్మెల్యే, పోలీసుల తీరుపై ధ్వజమెత్తిన పిల్లి సుభాష్ , గూడూరి , రౌతు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** సిటీ నియోజకవర్గం పరిధిలోని 40వ డివిజన్‌లో టీడీపీ నుంచి వైసిపిలోకి చేరికల కార్యక్రమాన్ని పోలీసులే అడ్డుకోవడం దారుణమని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసిపి నాయకులపై పోలీసులే దాడికి దిగడంపై మండిపడ్డారు. 40వ డివిజన్ కృష్ణ నగర్‌లో స్థానిక టీడీపీ నాయకుడు కొల్లి నాని 300 మంది అనుచరులతో కలిసి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ సమక్షంలో వైసిపిలో చేరేందుకు భరత్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతి లేకుండా జరుగుతున్న పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు అనుమతి లేకుండా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవ డానికి పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తత కు దారి తీసింది. మార్గాని భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇతర వైసిపి నాయకులు, పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులకు వైసీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు భారీగా మోహరించి మార్గాని భరత్ రామ్‌ను అరెస్టు చేసి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కూటమి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. మార్గాని భరత్ రామ్ పోలీసు జీపు నుంచే మీడియాతో మాట్లాడారు. పోలీసులే ప్రజాస్వామ్య విధానంలో జరుగుతున్న వైసిపి కార్యక్రమాన్ని అడ్డుకోవడం గర్హనీయ మన్నారు. పోలీసులు ఖాకీ చొక్కాలు మానేసి పచ్చ చొక్కాలు వేసుకోవాలని ధ్వజమెత్తారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య జీపు పై నుంచి కొల్లి నాని మెడలో వైసిపి కండువా వేసి పార్టీలో చేర్చుకున్నారు. హత్యా యత్నం కేసులు ఉన్న టీడీపీ కార్యకర్తలను పోలీసులే తమపై దాడికి ఉసిగొలిపారని ప్రజా స్వామ్యంలో ఇంత దారుణమైన ఘటనలు చూడలేదని ఆందోళన వ్యక్తం చేసారు. చేరిక లను అడ్డుకోవడానికి పోలీసులే ప్రయత్నించడం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. బలవంతంగా పోలీసులు దాడికి దిగడం దారుణ మన్నారు. ఇవిఎం ఎమ్మెల్యే పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ వారిని వైసిపి నాయకులపైకి పంపారని ఆగ్రహం వ్యక్తం చేసారు. . ఈ వ్యవహారాన్ని తాము వదిలేది లేదని, కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఇవిఎం ఎమ్మెల్యేకు వంత పాడుతున్న పోలీసులను కూడా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేసారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు లు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసిపి నాయకులపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిషేధిత భూ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక 22-ఏ మేళా

- ఆర్డీవో కె.ఆనందరావు



**కొవ్వూరు, పెన్ పవర్, ఆగస్ట్ 19:** కొవ్వూరు డివిజన్ పరిధిలో ఉన్న 22-ఏ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న ప్రత్యేక 22-ఏ మేళా నిర్వహించనున్నట్లు కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ 22 శనివారం ఉదయం 11 గంటల నుంచి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఈ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22-ఏ నిషేధిత జాబితా భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీదారులు అవసరమైన పత్రాలతో మేళాకు హాజరై దరఖాస్తులు సమర్పించవచ్చని ఆర్డీవో తెలిపారు.

# నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** నగర పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచి ప్రజల్లో సంతృప్తి స్థాయిని 68 నుంచి 80 శాతానికి పెంచేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులతో ఆయన పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పారిశుద్ధ్య పరిస్థితులు, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, చెత్త సేకరణ, డీ-సిల్టింగ్, ఫాగింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య విభాగంలో రిటైర్‌మెంట్, మృతిచెందిన కారణాలతో ఖాళీలను భర్తీ చేస్తూ 79 మంది కార్మికులను కొత్తగా తీసుకున్నామని తెలిపారు. అదనంగా పనిచేస్తున్న 185 మంది కార్మికుల వేతనాలను రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచామని వెల్లడించారు. వాహనాల సిబ్బంది వేతనాలను రూ.18,500కు పెంచినట్లు తెలిపారు. నగరంలో తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి వార్డుకు పారిశుద్ధ్య షెడ్యూల్ లో నిర్దేశిత పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీ-సిల్టింగ్, ఫాగింగ్, గ్యాంగ్ వర్క్‌తో పాటు ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, డ్రైనేజీల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. వార్డులో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని, ఎమ్మెల్యే శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

# పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్





**గంగవరం /దేవీపట్నం/రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** పోలవరం ప్రాజెక్టు పరిధిలోని పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా లెఫ్ట్ కెనాల్‌కు నీటి మళ్లింపు పనులను వేగవంతం చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

బుధవారం దేవీపట్నం మండలం నేలకోట వద్ద పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సంబంధించిన నీటి మళ్లింపు కెనాల్, పైప్‌లైన్ పనులను జల విద్యుత్ శాఖ ఇంజినీర్లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. లెఫ్ట్ కెనాల్‌కు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ల పరిస్థితిని పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్లకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, అవసరమైన చర్యల కోసం సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టర్ వెంట ఓఎస్డీ జావలి, తహసీల్దార్ కె. సత్యనారాయణ, జల విద్యుత్ ప్రాజెక్టు అధికారులు, కృష్ణ, డీఈ శ్రీనివాసరావు, ఇంజినీర్లు తదితరులు ఉన్నారు.

# రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో మెరకవీధి మున్సిపల్ పాఠశాల అభివృద్ధి



- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 24వ డివిజన్ మెరకవీధి లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏపీ పేపర్ మిల్లు సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన తరగతి గదుల మరమ్మతులు, అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల వెనుక గోడ శిథిలావస్థ, తరగతి గదుల స్లాబుల పెచ్చులు ఊడిపడటం, వాటర్ లీకేజీలు, కిటికీలు, తలుపులు దెబ్బతినడం, గ్రిల్స్‌కు తుప్పు వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడు తున్నారని తల్లిదం డ్రులు తన దృష్టికి తీసుకువ చ్చారని చెప్పారు. స్థానిక వార్డు ఇన్‌చార్జి కాశీ సూచనతో పాఠశాల సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలలో 16 మంది విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో ఈ ఏడాది 36కు పెరిగిందని చెప్పారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులు అందించిన ఏపీ పేపర్ మిల్లు యాజమాన్యానికి ఎమ్మెల్యే వాసు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఆవరణలో శానిటేషన్ సిబ్బంది మస్టర్ రూమ్ ను విద్యార్థుల అవసరాలకు వినియోగించాలన్నారు. వంటశాల, విద్యార్థులకు భోజనం షెడ్డు, ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలని సూచించగా, గ్లాస్ వరల్డ్ అధినేత కమల్ సొంత నిధులతో గది, షెడ్డు, ప్లాట్‌ఫామ్ నిర్మించారని చెప్పారు. కమల్ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి, గత వైసీపీ ప్రభుత్వానికి స్పష్టమైన తేడా ఉందన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషంగా ఉండటం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం హర్షనీ య మన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో పాఠశాలలను ఆధునీకరించామని ప్రచారం చేసిందని, వాస్తవ పరిస్థితుల్లో గోడలకు సున్నాలు వేయడం మినహా మౌలిక వసతుల అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి రామలింగం మృతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజానికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు, వెలుగు పత్రిక సంపాదకుడు దేవులపల్లి రామలింగం (60) మంగళవారం కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడిలో జన్మించిన రామలింగం 1985లో ఆంధ్రభూమిలో పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం డెక్కన్ క్రానికల్లో 1998 వరకు పనిచేశారు. తరువాత ఉదయం దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా చేరి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు.

2002లో రాజమహేం ద్రవరంలో వెలుగు పత్రికను ప్రారంభించి, అప్పటి నుంచి సంపాదకుడిగా కొనసాగు తూన్నారు. ముక్కు సూటి తత్వం, నిరాడంబర జీవనం, విస్తృత పరిజ్ఞానం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి.

జర్నలిజం కోసం తన వ్యక్తిగత ప్రయోజనాలను త్యజించిన రామలింగం, సొంత ఆస్తిని సైతం పత్రిక నిర్వహణకు వినియో గించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడారు. పత్రికా రంగానికే తన జీవితాన్ని అంకితం చేశారు.

రాజకీయ నేతలు, ప్రభుత్వ ఉన్నత అధికారులతో తదితర ప్రముఖులతో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి.

నిరాడంబరత, నిజాయితీ, , నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన రామలింగం మృతి తెలుగు జర్నలిజం రంగానికి తీరని లోటని సహచర పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.

# చిరుధాన్యాలు, అపరాలు పంటలకు ప్రాధాన్యత ఇవ్వండి ..వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్..







**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు19:** అడ్డతీగల మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా డీ .కొత్తూరు మరియు వేటమామిడి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు కొన్ని సూచనలు చేశారు. ఎల్మినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న కారణంగా, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి పంట సాగు చేయాలని, నీటి వసతి లేని ప్రాంతాలలో చిరుధాన్యాలు మరియు అపరాల పంట సాగు చేపట్టాలని వ్యవసాయాధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ సూచించారు. వరి వేసిన రైతులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, దీనికి గడువు ఆగస్టు నెలాఖరు వరకు పొడిగించడం జరిగిందని ఆయన తెలియజేశారు. అలాగే ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీ.ఎఫ్. ఆర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ,ఈ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే రాబోయే రోజుల్లో వ్యవసాయ పథకాలకు అర్హత లభిస్తుందని ఏ.వో శివ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అడ్డతీగలలో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం...



అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు 19; 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అడ్డతీగల ఫోటోగ్రాఫర్ల యూనియన్ ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలిత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రె చిత్రపటానికి సీనియర్ ఫోటోగ్రాఫర్ మన్యంపల్లి. రామకృష్ణ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఫోటోగ్రాఫర్స్ అందరూ ఆయన చిత్రపటం వద్ద నమస్కరించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్, పి . అచ్యుత్, స్టార్ శీను, రాజు, అప్పాజీ, రవికుమార్, హర్ష పాల్గొన్నారు.

# పంట బీమా ప్రతి రైతుకూ ధీమా

**పెన్ పవర్, ఉంగుటూరు --- ఆగష్టు 19**
ఉంగుటూరు మండలంలోని ఎర్రమిల్లిపాడు, గొల్లగూడెం, గోపాలాపురం, గోపీనాథపట్నం గ్రామాల్లో మంగళవారం, బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా పంటలకు సంభవించే నష్టాల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ప్రతి రైతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద పంట బీమా చేసుకోవాలని సూచించారు. 'సూపర్ ఎల్ నినో' ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఏపీఏఎంఐఎస్ ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరుపై రైతులకు అవగాహన కల్పించారు.

ఉద్యాన శాఖ అధికారి అమరనాథ్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ




ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, రాయితీలు, ఆధునిక సాగు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.


## ఈ.పి.ఎస్.95 పెన్షనర్స్ కు కనీస పెన్షన్, డి ఎలు ఇవ్వాలని ధర్నా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** ఆల్ పేన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమేశ్వరరావు,మోహనరావు ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేసి కలెక్టర్ కువినతి పత్రం అందజేయడంజరిగింది. ఈదర్నా ను ఉద్దేశించి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎస్ ఎస్ మూర్తి, సిఐటియు జిల్లా కోశాధి కారి కే.ఎస్.వి.రామ చంద్ర రావు, ఏ పి ఆర్ పి ఎ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వి.ఎన్. పూర్ణిమ రాజు,డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి వి. రాంబాబు, ప్రైవేట్ హాస్పిటల్స్ యూనియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ ఈ పి ఎస్ 95 పెంషనర్స్ కు కనీస పెన్షన్ రూ.9 వేలు ప్లస్ డియే ఇవ్వాలనిరైల్వే ప్రయాణం లో రాయితీ ఇవ్వాలన్నారు. కేంద్ర బీజే పి ప్రభుత్వం గడిచిన 12 సంవత్సరాల నుండి ఉద్యోగులు, ఉపాధ్యా యులు, కార్మికులు,పెన్షనర్ల కు వ్యతిరేకంగా చట్టాలు చేస్తూ ఉన్న రాయతీలను ఊడగొట్టి ఇబ్బందుల పాలు చేస్తుందని అన్నారు. ఈ పి ఎస్ 95 పేన్షనర్ లకు హయ్యర్ పెన్షన్ అమలు చేయడం లో త్రీవ్ర నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందని దేశంలో కోట్లాది మంది పెన్షనర్స్ కు నష్టం కలిగించే పెన్షన్ రివెల్యూయేషన్ బిల్ 2025 ను రద్దు చేయాలని పోస్టల్, బి ఎస్ ఎన్ ఎల్ ,బ్యాంకు ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పర్ష్కరించాలని కోరారు. ఎన్ పి ఎస్, సిపిఎస్, యుపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12 వ పి అర్ సి కమీషనర్ ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న 5 డి ఎ లను వెంటనే ప్రకటించాలని, సిపీ ఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలని,రాష్ట్రం లో ఈపీఎస్ 95 పెంషనర్ లకు కనీస పెన్షన్ రూ.9,000 డిఎ తో చెల్లించాలని కేంద్ర ప్రభత్వా న్

## వంటలక్క టీ టైం దగ్గర రెండు బైక్స్ ఢీ ఇరువురికి గాయాలు





**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 19:--** ఎదురెదురుగా వస్తూ రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి ఇది గోకవరం మండలం గోకవరం శివారు వీర్లంక పల్లి రహదారిలో ఉన్న ఊర కాలవ సమీపంలో వంటలక్క టీ టైం సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. కోరుకొండ మండలం
కనుపూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గోకవరం వస్తుండగా తంటికొండ గ్రామానికి చెందిన మరో వ్యక్తి రాజమండ్రి వైపు వెళు తున్నారు ఇరువురు గంగాలమ్మ గుడి ఊరకాలవ సమీపంలో ఉన్న వంటలక్క టీ టైం వద్దకు చేరుకునేసరికి రాజమండ్రి వైపు నుండి వస్తున్న కుడివైపు ఉన్నవ్యక్తి టీ టైం వైపుకు తిరగగా ఎదురుగా రాజమండ్రి వైపు నుంచి వెళుతున్న మరో వ్యక్తి ఇరువురు బలంగా ఢీకొనడంతో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో బాధితులను గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు అయితే దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు.

## దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

### ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:19:** ఈ చిత్రంలో కనిపిస్తోంది కూనవరం నుండి కోరుకొండ వైపు రహదారి సీతానగరం మండల పరిధిలోని కూనవరం గ్రామ శివారులోని తారుతేలిపోయింది. రోడ్డు దెబ్బతినిగత ఐదేళ్లు గడుస్తున్నా గత ప్రభుత్వంలో డబల్ రోడ్డు పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారు. అప్పటినుండి ఇప్పటివరకు ఈ రోడ్డుఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. కూనవరం గ్రామ ప్రజలు అధికారులు దృష్టికి అదిగో ఇదిగో అని కాలయాపన చేశారు తప్ప పట్టించుకోలేదని ప్రజల ఆరోపిస్తున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పల్లెల్లోనే ఉండాలని గొప్ప గొప్ప నేతలు కలలు కన్నప్పటికి అవి కలలుగానే నిలిచిపోయాయి . కంప్యూటర్ యుగంలో మనిషి పోటీపడి మేధాశక్తిని పెంపొంది అంతరిక్షంలో అడుగుపెడుతున్న ఈ రోజుల్లో రవాణ సౌకర్యం కూడా లేక కూనవరం వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారిన నేతలు మారిన రోడ్ల పరిస్థితి మారలేదు. ఈ రోడ్డుపై రోజు ప్రయాణం చేయాలంటే వారి ఆరోగ్యాలు సైతం పాడవుతున్నాయని రోడ్డు భవనాల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మరి దారుణంగా తయారయింది. ఎన్నడూ లేని విధంగా ఈ రోడ్డు ఉండడంతో కూటమి ప్రభుత్వంపై కూడా ప్రజల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కూనవరం, గ్రామానికి ఆర్టీసీ సౌకర్యం, అంబులెన్స్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కూనవరం నుండి కోరుకొండ వైపు వెళ్లే ప్రధానరహదారి త్రాగునీటి సమస్యలు త్వరిగతిన పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

### ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో కమిషనర్ రాహుల్ మీనా





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19**
నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా సమీక్షించారు. వివిధ దశలలో ఉన్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని శంకుస్థాపనలు చేసిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. జంక్షన్లు, లోలెవల్ ప్రాంతాలు, హైవేలను అనుసంధానించే రోడ్లపై శ్రద్ధ పెట్టాలన్నారు. నేల గట్టిదనాన్ని బట్టి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని.. వాహనదారుల భద్రతకు, ప్రయాణ సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ రహదారులపైన గుంతలు లేకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై నీరు నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకూడదని, లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలన్నారు. ప్రజల్లో సంతృప్తి ఉండేలా అభివృద్ధి పనులు జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో పజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిం చాలన్నారు. సమీక్షలో ఎస్ఈ రీటా, ఈఈలు మదర్షా అలీ, మాధవి, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ం

## 3వ వార్డులో కుడుపూడి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 19:** స్థానిక మూడవ వార్డు నెహ్రూ నగర్ రామాలయం వీధిలో నగరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కడుపూడి సత్తిబాబు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని కడుపూడి సత్తిబాబు అన్నారు. నగరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు, వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన 24వ డివిజన్ టీడీపీ సీనియర్ కార్యకర్త కొటికలపూడి కాశీకి టీడీపీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు పత్రాలను ఆయన సతీమణి శ్రీ దుర్గకు ఎమ్మెల్యే వాసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు అనుకోని ప్రమాదాలు, హఠాత్తు మరణాలలో వారి కుటుంబాలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో నారా లోకేష్ టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. సిటీ నియోజకవర్గంలో ఆరుగురు కార్యకర్తలు మృతి చెందగా, వారి కుటుంబాలకు నేరుగా రూ.5 లక్షల చొప్పున బీమా మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. కాశీ కుటుంబానికి ఉపాధి కల్పిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆమె పిల్లల విద్యకు సంబంధించి సూర్యదీప్ విద్యాసంస్థతో మాట్లాడి ఫీజు రాయితీ కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ.. తన భర్త ఇటీవల ప్రమాదంలో మృతి చెందడంతో టీడీపీ తరఫున రూ.5 లక్షల ప్రమాద బీమా మొత్తం అందిందన్నారు. తన కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు, టీడీపీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## జీవో 3 పునరుద్ధరించాలని కూనవరంలో రిలే దీక్షలు...

### ఆదివాసీల ఉపాధికి జీవో 3 ఆధారం




**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు19.** జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోరుతూ కూనవరం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను
జిల్లా నాయకులు సున్నం రాజులు, పులి సంతోష్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, వర్షాకాల శాసనసభ సమావేశాల్లోనే జీవో 3 కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇదే జీవనాధారమని అన్నారు. పాడేరు,సీతంపేట,కేఆర్‌పురం, రంపచోడవరంలో ఇప్పటికే ఆందోళనలు జరిగాయని, కూనవరంలో చేపట్టిన దీక్షలకు అన్ని వర్గాల మద్దతు కావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ పాయం రంగమ్మ సంఘీభావం తెలిపి, ఎన్నికల హామీలను మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో 100 శాతం స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఎంపీటీసీలు ధర్ముల అమ్మాజీ, కారం జయసుధ,మాజీసర్పంచులు మడకం నాగమణి,బొగ్గ వెంకమ్మ, గుండం బుచ్చమ్మ,గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య,తెల్లం తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో 3--5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలి

**జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 19:** ప్రజల ఫిర్యాదులు, సమస్యలను స్వీకరించి సత్వర పరిష్కారం అందించేందుకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల సిబ్బంది ప్రతి పని దినం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే అందించడంతో పాటు, వారి సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించడంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలు కీలకంగా పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.వ్యవసాయం, సర్వే, రెవెన్యూ, వైద్యం, ఇంజినీరింగ్ తదితర శాఖల సిబ్బంది తరచూ క్షేత్రస్థాయి విధుల్లో ఉండటంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో లేకపోతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించినట్లు తెలిపారు.

**పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయంలో సిబ్బంది ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సంబంధిత సిబ్బందికి నేరుగా తెలియజేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఇతర శాఖలు లేదా ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బందికి ఈ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేశారు.

## గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏజెన్సీ డీఈవో తనిఖీ





**గంగవరం, పెన్ పవర్:** గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు సందర్శించి పాఠశాల విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.పాఠశాలలో మొత్తం 103 మంది విద్యార్థులకు గాను 85 మంది హాజరైనట్లు గుర్తించారు. 9 మంది ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం మరింత పెరిగేలా, వంద శాతం హాజరు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.అనంతరం ఎఫ్ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నట్లు తెలిపారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేసి ఉన్నట్లు గుర్తించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలతో పాటు వారి హాజరు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో సూచించారు.


## వి బి జి రాంజీ లో మూడు వందల పని దినాలు తప్పనిసరి



**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, ఆగస్టు 19 :** వి బి జి రాంజీ లో మండలం లో ప్రతి పంచాయతీలో 300 రోజులు పని దినాలు తప్పనిసరి అని ఎంపీడీవో కే బాపన్న దొర ఆదేశించారు.

గుర్తేడు మండలంలో వి బి జి రాంజీ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రతి పంచాయతీ నుండి 300 దినాలకు తక్కువ కాకుండా పని దినాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. బెంబు ఎస్టిమేట్లు మూడు రోజులలో పూర్తి చేయాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, ఈసీ కు ఆదేశాలు జారీ చేశారు. వి బి జి రాంజీ కు సంబంధించిన ఆఫీసును గుర్తేడు లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా గుర్తేడు మండలములో ధారగడ్డ, గుర్తేడు, పాతకోట, బొడ్డగండి(చాపరాయి), చింతలపూడి పంచాయతీలలో పోలింగ్ బూతులు వెరిఫికేషన్ చేయడం జరిగిందని తెలిపారు.


## ప్రజల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ప్రత్యేక సమయం




**-- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 19:**ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే స్వీకరించి, సత్వర పరిష్కారం అందించేందుకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల సిబ్బంది ప్రతి పని దినం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందించడంతో పాటు వారి సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి నేరుగా తీసుకెళ్లేందుకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలు కీలక వేదికలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. క్షేత్ర విధులతో పాటు ప్రజలకు అందుబాటు

వ్యవసాయం, సర్వే, రెవెన్యూ, వైద్యం, ఇంజినీరింగ్ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది తరచూ క్షేత్రస్థాయి విధుల్లో నిమగ్నమవుతున్న నేపథ్యంలో, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను గ్రామ, వార్డు స్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత సమయంలో సిబ్బంది ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన అంశాలను సంబంధిత సిబ్బందికి నేరుగా తెలియజేసేందుకు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండటం ద్వారా ప్రభుత్వ సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇతర శాఖలు లేదా ఇతర ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బందికి ఈ ఆదేశాలు వర్తించవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆదేశాల అమలును సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె సూచించారు.




## డ్వాక్రా లో పారదర్శకతతో ఆదా అయ్యే కోట్లు - మరో సంక్షేమానికి బాట

**డ్వాక్రా సభ్యులుగా చేరడానికి అర్హతల తనిఖీ అవసరం -**

**తూగో జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షుడు**



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 19:-**1998లో ప్రారంభమైన డ్వాక్రా వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ కు గర్వ కారణం.నిరుపేద,నిరుద్యోగ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు పుట్టిన ఈ పథకం 27 ఏళ్లలో లక్షల మంది జీవితాలను మార్చింది.పావలా వడ్డీ, వడ్డీ రాయితీ, బ్యాంక్ లింకేజ్ తో మహిళలు స్వయం ఉపాధి బాటపట్టారు.కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలులో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ ఎచ్ జి సభ్యులుగా కేవలం బీ పీ ఎల్ కుటుంబాలకు చెందిన నిరుపేద మహిళలు మాత్రమే అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు,ఆదాయ పన్ను చెల్లించే కుటుంబాలు అనర్హులు కాగా బినామీగా వారు భక్తి ఆదాయాలను ప్రభుత్వము నుండి ప్రభుత్వం కళ్ళుగప్పి సంఘాలలో చేరి నిరుపేదలకు అందాల్సిన ఎన్నో రాయితీలను దోచుకుంటున్నారు అనేది ప్రధాన వాదనగా వినిపిస్తుంది.పలు జిల్లా పలు మండలాల్లో అర్హత లేని వారు కూడా సభ్యులుగా చేరి,బ్యాంకురుణాలు, సబ్సిడీలు, రాయితీలు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.దీనివల్ల అసలైన లబ్ధిదారులకు అవకాశాలు దూర మవుతున్నాయి.ప్రభుత్వ ఖజానాపై కూడా భారీగా అదనపు భారం పడుతుంది అది జగమెరిగిన సత్యం.

**ఆదా అయ్యేనిధుల ప్రాముఖ్యత**

ఒకవేళ అనర్హులను గుర్తించి వారికి ఇస్తున్న ప్రయోజనాలను ఆపితే కోట్ల రూపాయలు ఆదా అవుతాయి.ఆ నిధులను ప్రభుత్వం విద్య, ఆరోగ్యం లేదా ఇంకో శాశ్వత అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించ వచ్చు. అంటే "ఆదా అయ్యే డబ్బుతో మరో సంక్షేమం" అనేది సాధ్యమే అని ఆ విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్**

**డిమాండ్**

ఈ అంశంపై లిమానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బత్తిన వి వి రామకృష్ణ మాట్లాడుతూ "డ్వాక్రా వ్యవస్థను మేము వ్యతిరేకించడం లేదు. కానీ 27 ఏళ్ల తర్వాత ఒకసారి సమగ్ర తనిఖీ అవసరం. ప్రభుత్వం ఆధార్, ఉద్యోగ డేటాతో ఎస్ ఎచ్ జి డేటాను అనుసంధానం చేసి అనర్హులను తొలగించాలి. అప్పుడే నిజమైన పేద మహిళలకు పథకం ఫలాలు అందుతాయి అని అన్నారు.ఆయన మరింత వివరిస్తూ "ప్రభుత్వ ధనం అంటే ప్రజల సొమ్ము. అది వృథా కాకుండా అర్హులకు చేరితేనే సంక్షేమం సార్థకమవుతుంది. ఆదా అయ్యే ప్రతి రూపాయితో ఒక పేద బిడ్డ చదువుకు, ఒక కుటుంబ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు.

పరిష్కార మార్గం

నిపుణులు సూచిస్తున్న మార్గం సోషల్ ఆడిట్. ప్రతి 6 నెలలకు గ్రామసభలో ఎస్ ఎచ్ జి లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేసి అభ్యంతరాలు స్వీకరించాలి. అలాగే టెక్నాలజీ సహాయంతో వెరిఫికేషన్ ను కఠినతరం చేయాలి.

డ్వాక్రా అనేది మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆ పవిత్ర వ్యవస్థలో



బత్తిన వి వి రామకృష్ణ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మానవ హక్కుల ఫౌండేషన్ అధ్యక్షులు

చిన్న లీకేజీలు ఉన్నా వాటిని సరి చేస్తేనే పథకం లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసు కోవాలని మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షునిగా కోరుతున్నానని ఆయన అన్నారు.

ప్రస్తుతం సంక్షేమ అభివృద్ధి పరుగులు పెట్టించాలనే ఆలోచనలో తలమునకలైపోతున్న ప్రభుత్వం ఇటువంటి వాటి మీద కూడా దృష్టి సారించాలని తద్వారా కొంత ఆర్థిక వెసులుబాటు కూడా ప్రస్తుత ప్రభుత్వానికి కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సంబంధిత శాఖ మంత్రి వర్యులను మానవ హక్కుల ఫౌండేషన్ తరుపున కలవడం అవసరమైతే ముఖ్యమంత్రిగా దృష్టి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పునరావాసకాలనీ స్థలాలు ఎంపిక పై గ్రామసభ





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.19:**పోలవరం ప్రాజెక్టు ఫేజ్--1బి పరిధిలోవి.ఆర్.పురం గ్రామానికి చెందినగిరిజనేతరుల,నిర్వాసిత కుటుంబా లపునరావాస కాలనీ,స్థలాలుఎంపికపై మండలంలోని వి.ఆర్.పురంసచివాలయంవద్ద,సంబంధితఅధికారు లుబుధవారంనిర్వాసితులప్రజలతోగ్రామసభ నిర్వహించారు.పునరావాసకాలనీస్థలాలు ఎంపికకు సం బంధించిఇంతకుముందు ఆప్షన్--1లేదా ఆప్షన్--2ను ఎంచు కోవాలని,గిరిజనేతర పిడిఎఫ్,ను కోరి,ఆప్షన్ ఫారాలను,అధికారులు స్వీకరించి,ఉన్నారు.బుధవారం జరిగిన ఈ గ్రామసభలో ఎస్డిసి బాలకృష్ణ,రెడ్డి,మాట్లా డుతూ తాడ్వాయి ఆప్షన్,కు 481మందికోరుకోగా, తిరువూరు ఆప్షన్,కు181మందిఎన్నుకున్నారని, అన్నారు.ఇంకా120మంది ఎటువైపుఎన్నుకోకుండా ఉన్నారని,వారివద్దనుంచి ఈరెండురోజుల్లోఅనగా, బుధ,గురువారాల్లో వారి ఆప్షన్ ఫారాలను మాకు ఇవ్వాలని, ఆయనకోరారు.ఇప్పటివరకువచ్చిన రెండుఆప్షన్,లోతాడ్వాయికోరుకున్న నిర్వాసితు లనుముందుగావారిని సర్దుబాటు చేయటం జరు గుతుందని,పేర్కొన్నారు.తిరు వూరుకోరుకున్న,వారి గురించితర్వాత చూస్తామని తెలిపారు.సంబంధిత అదికారులు తాడ్వాయి ప్రాంత పున రావాస నివాస స్థలాలు ఉన్న ప్రదే శాన్ని ప్లెక్సీ మ్యాప్,లో చూపించి ఎక్కడెక్కడ ఎన్ని ప్లాట్స్ ఉన్నాయో చూపిం చారు. దీనికినిర్వాసితప్రజలు మాకుఆ ప్రదేశాన్ని నేరుగా చూపించాలని,ఆతరువాత మేము ఎక్కడ ఉండాలో నిర్ణయిస్తామనివారు తెలపగా,నిర్వా సితులకుఆ ప్రదే శాలు తప్పని సరిగా చూపిస్తామని,ఎస్డిసి అన్నారు.ఈ కార్యక్రమంలోమండలతహసిల్దార్,వై సర స్వతి,ఎటపాక సిఐ కృష్ణ,ఎస్ఐ షేక్ సాదిక్,విఆర్వో,భవాని,నిర్వాసితులు తదితరులు,పాల్గొన్నారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి




**రంపచోడవరం డిఎస్పి అష్రఫ్ అలీ**




**గంగవరం, పెన్ పవర్ ఆగస్టు 19:** మహిళల భద్రత, రహదారి భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం డీఎస్పీ పి. అష్రఫ్ అలీ సూచించారు. గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ అష్రాఫ్ అలీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, వ్యక్తిగత సమాచారం లేదా బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరాలకు గురైనప్పుడు ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ నంబర్ల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.అలాగే రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.కార్యక్రమంలో గంగవరం ఎస్సై వెంకయ్య, హెడ్ కానిస్టేబుల్ ఇజ్రాయెల్ రాజు, పోలీస్ కానిస్టేబుల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ , ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు రంగం సిద్ధం.. పూర్తి షెడ్యూల్, జట్లు, లైవ్ స్ట్రీమింగ్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ టూర్ లో భాగంగా 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 19 నుంచి 23 వరకు లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ ఆగస్టు 27 నుంచి 31 వరకు చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో, మూడో టెస్ట్ సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరగ ేనుంది. జూన్ 2027లో ది ఓవల్‌లో జరగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో టాప్-2లో నిలవాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకంగా మారింది.

బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత ఇంగ్లాండ్ ఆడుతున్న తొలి రెడ్-బాల్ సిరీస్ ఇది. ఈ సిరీస్ కోసం జో రూట్ తిరిగి ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. తొలి రెండు టెస్టుల కోసం డ్యాన్ లారెన్స్, మాజీ వైస్ కెప్టెన్ ఆలీ పోప్ జట్టులోకి పునరాగమనం చేయగా, గాయం కారణంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొలి రెండు టెస్టులకు ప్రకటించారు.

**పాకిస్థాన్‌కు కెప్టెన్ గాయం టెన్షన్..**

**అఫ్రిది ఔట్:**

మరోవైపు పాకిస్థాన్ జట్టు బాబర్ అజామ్ సారథ్యంలో బరిలోకి దిగుతోంది. జూలై 2026లో షాన్ మసూద్ స్థానంలో బాబర్ టెస్ట్ కెప్టెన్సీ చేపట్టినప్పటికీ, వేలి గాయం కారణంగా లీడ్స్‌లో జరిగే తొలి టెస్టుకు అతను ఆడటం అనుమానంగా మారింది. ఇక స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదిని ఈ పర్యటనకు ఎంపిక చేయకపోవడంతో సీనియర్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్ పాక్ పేస్ విభాగాన్ని నడిపించనున్నాడు.

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు**


భారతదేశంలో ఈ ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ (ాశీఅవ ాజుాశీతీం చీవ్షశీతీఎ) టీవీ ఛానెళ్లలో ప్రత్యక్షంగా చూడవచ్చు.. అలాగే డిజిటల్ వీక్షకులు సోనీ లివ్ (ాశీఅవ ా×ఎ) యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా మ్యాచ్‌లను వీక్షించవచ్చు. తొలి టెస్ట్ మ్యాచ్ ప్రతిరోజు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతుంది.

**ఇరు జట్లు:**

పాకిస్థాన్ జట్టు: బాబర్ అజామ్ (కెప్టెన్), షాన్ మసూద్, అబ్దుల్లా షఫీక్, అజాన్ అవాయిస్, ఇమామ్-ఉల్-హక్, ముహమ్మద్ అవాయిస్ జాఫర్, మహమ్మద్ రిజ్వాన్ (కీపర్), ముహమ్మద్ ఘాజీ ఘోరీ (కీపర్), అమీర్ జమాల్, సల్మాన్ అలీ ఆగా, సౌద్ షకీల్, అలీ ఉస్మాన్, సాజిద్ ఖాన్, ఖుర్రం షెహజాద్, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ, ఉబైద్ షా

ఇంగ్లాండ్ జట్టు: జో రూట్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, బెన్ డకెట్, మాథ్యూ ఫిషర్, ఎమిలియో గే, డ్యాన్ లారెన్స్, ఆలీ పోప్, ఆలీ రాబిన్సన్, జేమీ స్మిత్, జోష్ టంగ్

# డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్.. టెన్నిస్ నుంచి నిక్ కిర్గియోస్ సస్పెండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్ 13 నిక్ కిర్గియోస్ నిషేధిత డ్రగ్స్ వాడుతూ దొరికిపోవడంతో క్రీడా ప్రపంచంలో తీవ్ర కలకలం రేపుతుంది. ఇటీవల నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అతను డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ అతనిపై సడన్‌గా ప్రొవిజనల్ బ్యాన్ విధించింది. జూన్ 22న జరిగిన మల్లోర్కా ఓపెన్ టోర్నీ సందర్భంగా నిక్ కిర్గియోస్‌కు డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో అతను కొకైన్ వాడినట్లు నిర్ధారణ కావడంతో ఆగస్టు 4వ తేదీన అతనిపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సస్పెన్షన్ అమలులో ఉన్నంత వరకు అతను గ్రాండ్‌స్లామ్‌లు సహా ఎలాంటి ప్రొఫెషనల్ టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడటానికి, కోచింగ్ ఇవ్వడానికి లేదా చివరికి మ్యాచ్‌లకు హాజరవడానికి కూడా పర్మిషన్ ఉండదు. ఈ షాకింగ్ న్యూస్ బయటకు రాగానే నిక్ కిర్గియోస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. తన తప్పును బహిరంగంగా ఒప్పుకున్నాడు. నేను ఒక విపరీతమైన పెద్ద తప్పు చేశాను, దానికి పూర్తి బాధ్యత నాదే.. నా అభిమానులు, కుటుంబం, స్పాన్సర్లు, ముఖ్యంగా నన్ను రోల్ మోడల్‌గా భావించే పిల్లలకి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. నావల్ల ఇలాంటి రాంగ్ ఎగ్జాంపుల్ సెట్ అయినందుకు నా మీద నాకే చాలా నిరాశగా ఉందంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

**డిప్రెషన్ పై మనసు విప్పిన టెన్నిస్ స్టార్:**

తన పరిస్థితికి గల కారణాలను వివరిస్తూ.. గడిచిన రెండేళ్లుగా మోకాలు, మణికట్టు గాయాలతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు. మైండ్ అనుకున్నట్లు శరీరం సహకరించకపోవడంతో, కెరీర్ ముగింపునకు వచ్చేసిందనే ఘోరమైన సత్యాన్ని తట్టుకోలేక చాలా ఒంటరిగా, నిస్సహాయంగా ఫీల్ అయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ తప్పును సరిదిద్దుకోవడానికి రాబోయే 28 రోజుల పాటు సోషల్ మీడియాకు, పబ్లిక్ లైఫ్‌కు దూరంగా ఉంటానని ప్రకటించాడు.

**డేంజర్‌లో పడిన ప్రొఫెషనల్ కెరీర్:**

గాయాల సమస్యల వల్ల ఈ సీజన్‌లో కేవలం నాలుగు సింగిల్స్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 31 ఏళ్ల నిక్ కిర్గియోస్, చివరిగా వింబుల్డన్ డబుల్స్‌లో ఆడి ఫస్ట్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఇప్పుడు ఈ కొకైన్ రచ్చతో అతని ప్రొఫెషనల్ కెరీర్ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తప్పును రియలైజ్ అయి బ్రేక్ తీసుకుంటున్న కిర్గియోస్, మళ్లీ లైఫ్‌ను ట్రాక్‌లోకి తెచ్చుకుని ఎంతవరకు స్ట్రాంగ్‌గా కంబ్యాక్ ఇస్తాడో లేదో అనేది వేచి చూడాల్సింది.

# శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

**మ్యాచ్ సాగిందిలా..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**సుతార్ స్పిన్ మ్యాజిక్**

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.

# ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!



స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే






సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన -జాంబీ రెడ్డి- సినిమాతో హర్రర్-కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. -జాంబీ రెడ్డి- సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి.ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. -జాంబీ రెడ్డి- చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న -జాంబీ రెడ్డి 2-పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్-కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది.ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -ప్రళయ్- కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది.మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న -బ్యాంగ్ బ్యాంగ్- సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్-కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా.మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శుభపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965